## క్లుప్తంగా

### విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

**సీతానగరం:** మండలంలోని పెదబోగిలి మేజరు పంచాయతీ పరిధి బుడ్డిపేటలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ జె.తేరీజమ్మ, ఉప సర్పంచ్ అరవింద్ కుమార్ కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖాధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్. హరగోపాలరావు, ఎం. వెంకటరమణ, సీహెచ్ సత్యం, బి. శ్రీనివాసరావు, ఇజ్జాడ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

### సీఆర్‌టీలను రెన్యువల్ చేయాలి



ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సీఆర్‌టీలు

**పార్వతీపురం టౌన్:** సీఆర్‌టీలను తక్షణమే రెన్యువల్ చేయాలని యూటీఎఫ్ నాయకుడు మురళి కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. డీఎస్సీలో వారి పోస్టులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమేష్, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

### జాబ్‌మేళా రేపు

**సాలూరు:** పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్ లేలాండ్, వెసువస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎల్అండ్‌టీ, తదితర కంపెనీల ప్రతినిధులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్, మెటార్ మెకానికల్, తదితర ట్రేడ్‌లు పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, బయోడేటాతో ఆ రోజు ఉదయం పది గంటలకు హాజరుకావాలని కోరారు.

### వారాహి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న వారాహి అమ్మవారు

**సాలూరు:** పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### పింఛన్‌దారుల సమావేశం రేపు

**పార్వతీపురం టౌన్:** పట్టణంలోని రైతుబజార్ వెనుక గల పింఛన్‌దారుల సమావేశ భవనంలో పింఛన్‌దారులతో సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల అసోసియేషన్ కార్యదర్శి గణపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం సబ్‌ట్రెజరీ పరిధిలో గల పింఛన్‌దారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

### బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు...



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాబ్జీ, తదితరులు

**సీతానగరం:** మండలంలోని లచ్చయ్యపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో బడుగు, బలహీనవర్గాల వారి హక్కుల సాధనకు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సీహెచ్ రవి, ఎల్లయ్య, శ్రీరాములు, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

### కేసు నమోదు

**వీరఘట్టం:** మండలంలోని తూడి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ శనివారం తెలిపారు. అలాగే గ్రామ సచివాలయం రెయిలింగ్ విరగగొట్టడంపై కూడా కేసు నమోదు చేశామన్నారు. ఈ రెండు కేసులపై వేర్వేరుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# జ్వరాలపై అప్రమత్తం

- డీఎంహెచ్ఓ విజయపార్వతి



మక్కువ: మందులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె. విజయపార్వతి

**పార్వతీపురం టౌన్:** సీజనల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ కె. విజయపార్వతి అన్నారు. మండలంలోని పెదబొండపల్లి, డోకిశీల పీహెచ్‌సీలను డీఎంఓ టి. జగన్‌మోహనరావుతో కలసి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, ప్రతిరోజూ నమోదవుతున్న రోగుల సంఖ్య, అందులో జ్వరపీడితులు ఎంత మంది, వారికి చేపడుతున్న ఆరోగ్య పరీక్షలు, తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మలేరియా, డెంగీ, తదితర సీజనల్ జ్వరాలను గుర్తించి సత్వరమే చికిత్స అందజేయాలని ఆదేశించారు. మలేరియా నివారణ మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ప్రసవ గదులు, కాన్పుల రికార్డులను తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలన్నారు. పర్యటనలో డెమో యోగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**అందుబాటులో మందులు**

**మక్కువ:** సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచడంతో పాటు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె. విజయపార్వతి అన్నారు. మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీలలో డయేరియా, మలేరియా, టైఫాయిడ్ మందులు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే దోమతెరలు వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలం కావడంతో కాచి చల్లార్చిన నీరు తాగేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి టి. జగన్‌మోహనరావు, మక్కువ, శంబర పీహెచ్‌సీల వైద్యాధికారులు రెడ్డి హరికృష్ణ, కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పింఛన్ల పెంపుపై హర్షం



సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, నాయకులు

**మక్కువ:** రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల సొమ్మును పెంచడంతో పీడబ్ల్యూడీ ఫెడరేషన్, దివ్యాంగుల పరిరక్షణ సేవా సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక శ్రీరామా నర్సింగ్ హోమ్ ఆవరణలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి గుమ్మడి సంధ్యారాణి చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు మాట్లాడుతూ.. దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఏసుదాసు, టీడీపీ నాయకులు పి. మల్లేశ్వరరావు, చింతల తవిటినాయుడు, చోడవరపు రామకృష్ణ, కేశవ, దివ్యాంగులు పాల్గొన్నారు.

### కొండాపురంలో గ్రామసభ



ఎరువులు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

**పాలకొండ:** మండలంలోని కొండాపురంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై పలు తీర్మానాలు చేశారు. గ్రామంలోని సమస్యలపై చర్చించారు. పంచాయతీ ఆదాయం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఎరువుల పంపిణీ**

**పాలకొండ:** మండలంలోని కొండాపురం రైతుభరోసా కేంద్రం వద్ద శనివారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రతినిధి రాయి రామకృష్ణ, ఎంపీటీసీ ప్రతినిధి కరణం నారాయణరావు, గ్రామ పెద్దల చేతులమీదుగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు ఎరువులు అందజేశారు. పంటకు ఎంత మోతాదులో ఎరువులు వేసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు.

### రాజన్న జయంతి రేపు

**సీతానగరం:** మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో పార్వతీపురంలో సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపు మేరకు మండలంలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, పార్టీలో వివిధ స్థాయిల్లో సేవలందిస్తున్న మండల నాయకులు, కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, నియోజకవర్గ పార్టీశ్రేణులు సోమవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న రాజన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

### డీఈఓ ఆకస్మిక తనిఖీ

**భామిని:** భామిని ఏపీ మోడల్ స్కూల్‌ను పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి గార పగడాలమ్మ శనివారం సందర్శించారు. విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని, రోజు వారీ వంటల్లో తేడాలు ఉండాలని, వంటకాలను మరింత రుచికరంగా తయారు చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట ఏఎంఓ, ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

### శ్రీవారి సేవలో జీసీసీ ఎం.డి

**సీతంపేట:** తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో సీతంపేటలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని జీసీసీ ఎండీ జి.సురేష్‌కుమార్ శనివారం సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. ఆయనతో పాటు జీసీసీ డీఎం సంధ్యారాణి, సీతంపేట, పాతపట్నం జీసీసీ బ్రాంచ్ మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరువకావాలి

**భామిని:** నీతి అయోగ్ సూచనలతో అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా చర్యలు చేపట్టాలని నీతి అయోగ్ కేంద్ర పరిశీలకురాలు అనితా మజ్జి, పార్వతీపురం మన్యం జిల్లా సీపీఓ పి.వీర్రాజు అన్నారు. భామిని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిశోర్‌కుమార్, మండల కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఏస్పిరేషనల్ బ్లాక్, డిస్ట్రిక్ట్ కార్యక్రమం కింద రాష్ట్రంలో ఎంపికైన మూడు మండలాల్లో భామిని ఒకటని వివరించారు. జూలై నుంచి సెప్టెంబర్ 30 వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో 5 విభాగాల్లో చేపడుతున్న పథకాలు విస్తృతపరచి 40 ఇండికేటర్స్ ద్వారా ప్రగతి గుర్తింపు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పంటల ప్రదర్శన, నవధాన్యాల చక్రం, విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ గార పగడాలమ్మ, ఏడీఓ కె.రత్నకుమారి, ఎస్‌పీఎం డీపీఎం షణ్ముఖరాజు, మండల ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహనబాబు పాల్గొన్నారు.

# రథయాత్రకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 15 వరకు రథయాత్ర
- భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



వీరఘట్టం: రథయాత్రకు ముస్తాబైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి

**వీరఘట్టం:** మండల కేంద్రంలో ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాలను ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం నుంచి 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని, స్వామివారు ప్రతిరోజు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారని దేవాదాయశాఖ ఈఓ సర్వేశ్వరరావు, అర్చకులు లింగరాజ్‌రథో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలు, రథయాత్రలో పాల్గొని ఆ జగన్నాథస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

**కన్నుల పండుగగా జగన్నాథుని నేత్రోత్సవం**

స్థానిక మందిరం వీధిలో వెలసిన జగన్నాథస్వామి ఆలయాన్ని శనివారం సంప్రోక్షణ చేశారు. అనంతరం స్వామివారికి నేత్రోత్సవం నిర్వహించారు. ఆదివారం నుంచి జగన్నాథస్వామి రథయాత్ర ప్రారంభమవుతుంది. 11న హిరాపంచమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, 15న మారు రథయాత్ర ఉంటాయని అర్చకులు తెలిపారు.



స్వామివారి యాత్రకు ముస్తాబైన రథం

**పాలకొండ రూరల్:** జగన్నాథుని రథయాత్రకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ సర్వేశ్వరరావు తెలిపారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణపై దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకులతో శనివారం సమీక్షించారు. 10 రోజుల పాటు జరగనున్న ఈ యాత్రలో భక్తులకు ఎటువంటి సమస్యలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, విద్యుత్ అలంకరణ, భక్తుల భద్రత, మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్ష కొనసాగింది. అనంతరం క్షేత్ర స్థలంలో స్టాల్స్ ఏర్పాటును పరిశీలించారు.



పాలకొండ రూరల్: యాత్రస్థలంలో సిబ్బందితో చర్చిస్తున్న ఈఓ

**భామిని:** మండలంలోని బత్తిలిలో ఉన్న జగన్నాథ మందిరం వద్ద ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు రథయాత్ర ఉత్సవాలు నిర్వహణకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. జగన్నాథ, బలభద్ర, సుభద్రల విగ్రహాల ఊరేగింపునకు అవసరమైన రథాన్ని శనివారం సిద్ధం చేశారు. యాత్రకు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.

# స్వచ్ఛ పార్వతీపురమే లక్ష్యం




శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శ్రీనివాస్

**పార్వతీపురం టౌన్:** జిల్లా కేంద్రాన్ని స్వచ్ఛ పార్వతీపురంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని చర్చివీధి మున్సిపల్ పార్క్‌లో శనివారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పట్టణంలోని 30 వార్డుల్లో క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వార్డుల్లో సిబ్బంది క్రమం తప్పకుండా ఫాగింగ్, క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్, ఏఈ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఆర్ఐ, ఏఎస్ఓ, ఈ1, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

# పెంపుడు జంతువులకు టీకాలు..



సీతానగరం: నిడగల్లులో పెంపుడు జంతువుకు యాంటీ ర్యాబిస్ టీకా వేస్తున్న డాక్టర్ రామారావు



బలిజిపేట: మండల కేంద్రంలో కుక్కకు టీకా వేస్తున్న వైద్యాధికారి గణేష్



మక్కువలో యాంటీ ర్యాబిస్ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పశుసంవర్థక శాఖాధికారులు పెంపుడు జంతువులకు శనివారం టీకాలు వేశారు. జంతువుల నుంచి మనుషులకు.. మనుషుల నుంచి జంతువులకు వ్యాధులు సంక్రమించకుండా ఉండేందుకు టీకాలు వేస్తున్నట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. సీతానగరం మండలంలోని సీతానగరం, నిడగల్లు.. బలిజిపేట మండలంలో బలిజిపేట, బర్లి, చిలకలపల్లి.. మక్కువ మండలంలోని మక్కువ, శంబర, కొట్టిశ పశువుల ఆస్పత్రుల్లో కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు.

సీతానగరం/బలిజిపేట/మక్కువ

# శిక్షణ తరగతులను విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**పార్వతీపురం టౌన్:** కాకినాడలో జరగనున్న రాష్ట్ర విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఈ మేరకు శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు జూలై 8 నుంచి 10 వరకు కాకినాడ పట్టణంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ హరికృష్ణ, నాయకులు వికాస్, వినయ్ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

# ఎండుతున్న నారుమడులు



కేఎస్ పురం వద్ద ఎండిపోయిన వరి వెద పైరు

**సీతానగరం:** ఖరీఫ్ సీజన్‌లో అనుకున్నంత స్థాయిలో వర్షాలు పడకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయి. మండలంలోని కేఎస్ పురం, వెన్నెల బుచ్చింపేట, దయానిధిపురం, రంగంపేట, పీబీ పేట, జానుమల్లువలస, వెంకటాపురం, తదితర గ్రామాల్లో వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. ఇటీవల పడిన కొద్దిపాటి వర్షానికి రైతులు నారుమడులు వేశారు. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నారుమడులు ఎండిపోతుండడంతో ట్యాంకర్ల ద్వారా నీటి తడులు అందిస్తున్నామని రైతులు చెబుతున్నారు. మరికొద్ది రోజుల్లో వర్షాలు కురవకపోతే ఖరీఫ్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని వాపోతున్నారు.

# అనారోగ్యంతో గిరిజన విద్యార్థి మృతి

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని బాలేసు పంచాయతీ బయ్యాడ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి బి.ఈశ్వరరావు (15) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విద్యార్థి జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభమవ్వడంతో పాఠశాలకు వచ్చి మరలా ఇంటికి వెళ్లిపోయాడని, తదనంతరం అనారోగ్యం కారణంగా ఈశ్వరరావు మృతి చెందినట్లు సమాచారం.